


# నొసటి రాత

ముద్దంశెట్టి హనుమంత రావు

రాత్రి భోజనాలు ముగిశాక, సోఫాలో కూచుని టి.వి. చూస్తున్నారు, రాజు, సునందాను. రాజు, హుషారుగానే వున్నాడు.కానీ, సునంద మాత్రం, గర్భిణీ అవడంవల్ల కాస్త ఇబ్బందికరంగానే కూచుంది.

ఊరికే ఇంట్లో కూచోకుండా, ఏదో ఒక పని చేస్తూ వుంటే, సులువుగా ప్రసవం వస్తుందని లేడీ డాక్టరు చెప్పడంవల్ల, విశ్రాంతి తీసుకోకుండా, ఇంట్లో వంటపని కూడా తనే మెల్లగా చేసుకుంటోంది, సునంద. చాలావరకు, భర్త రాజు సహాయం చేస్తున్నాడు. అటువంటి అనుకూలుడైన భర్త తనకి లభించినందుకు, దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ వుంటుంది.

"సునందా, రేపట్నుంచి పదిహేను రోజులు సెలవు పెట్టాను. ఇక, నువ్వు అంతగా కష్టపడవల్సిన పని వుండదు.." అన్నాడు, రాజు.

"మంచి పని చేశారండీ" అంది, సన్నగా మంద హాసం చేస్తూ.

"మరో నాలుగైదు రోజుల తర్వాత, మా అక్కకూడా వస్తానంది" అన్నాడు మళ్ళీ.

"మరింకేం? మనకి, ఇంకే ఇబ్బందీ వుండదు."

"అయినా సునందా, హాస్పిటల్లో చేర్పిస్తానంటే, మొరాయించుక్కూచున్నావు, వద్దని! హాస్పిటల్లో అయితే, ఎంతో బావుండేది కదా! వాళ్ళే అన్నీ చూసుకునేవారు" అన్నాడు, రాజు.

"నా సుఖం కోరి నేను హాస్పిటల్లో చేరిపోతే, మీరు ఇబ్బందిపడతారండీ! హాస్పిటల్కీ, ఇంటికీ, ఎంతని తిరుగుతారు చెప్పండి! హోటల్ భోజనం,మీకు పడదాయె! అందుకే వద్దన్నాను," అంది సునంద.

"నాకేం ఇబ్బందిలే సునందా. నేనెలాగో అడ్జస్టు అవుతానుకదా. నీది, మొదటి కాన్పు. అందునా, మనది లేటు మారేజ్. అందుకే చెబుతున్నాను, ఇప్పటికయినా మించిపోయిందేమీ లేదు. హాస్పిటల్లో చేరిపోకూడదూ!" అన్నాడు రాజు, మరోసారి నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తూ.

"మళ్ళీ ఆ ప్రసక్తి తీసుకొచ్చారా, మరేం అనకండి. నేను హాయిగానేవున్నాను.

అడపాదడపా ఏదో పనిచేసుకుంటూ వుంటే, సులువుగా ప్రసవం వస్తుందని, డాక్టరమ్మ చెప్పిందికదా! మీరేమీ కంగారుపడకండి," అంది సునంద.

రాజు, భారంగా ఓ నిట్టూర్పు వదిలాడు.

'నువ్వు మరీ మొండిగా వాదిస్తే నేనింకేం చెప్పగల్ను సునందా? నీ ఇష్టం" అనేశాడు, రాజు.

సునంద, మరేం మాట్లాడలేదు.

మరి కాస్సేపటికి, గడియారం పది గంటలు కొట్టింది.

"అదిగో పది గంటలయ్యింది సునందా! పద పడుకుందాం" అన్నాడు, రాజు టి.వి. ని ఆపేస్తూ.

ఇద్దరూ వెళ్ళి పడుకున్నారు.

* * *

రాత్రి పడకొండున్నరయ్యింది.

సునందకి నొప్పులు ప్రారంభమయ్యాయి. భర్తని లేపింది. రాజు కంగారుపడ్డాడు. సుమారు అర్ధరాత్రి సమయంలో.

"ఇప్పుడేం చేద్దాం సునందా!"అన్నాడు, ఆరాటంగా.

"మరేం ఆలోచించకండి. హాస్పిటల్‌కి పోదాం.. ఆటోగానీ, టాక్సీగానీ చూడండి. లేదంటే ఆంబులెన్సుకోసం ఫోను చెయ్యండి.." బాధపడుతూనే అంది, సునంద.

"నువ్విలా వచ్చి కాస్సేపు సోఫాలో కూచో. నేను వెహికిల్ కోసం చూస్తాను. దిక్కుమాలిన మన కాలనీ, నగరానికి దూరంగా వుంది. ఇటువంటి సమయాల్లోనే ఇబ్బంది ఏమిటో తెలుస్తుంది" అంటూ భార్యని మెల్లగా సోఫావరకూ నడిపించి, అక్కడ కూచోబెట్టాడు, రాజు.

"ఇప్పుడే వస్తాను" అంటూ తలుపు దగ్గరికి వేసి, బైటికి నిష్క్రమించాడు.

రాజు, రోడ్డుమీదికివచ్చేసరికి, సుబ్బారావు ఎదురయ్యాడు.

"ఏమిత్రా రాజా ఏమిటా కంగారు" సుబ్బారావు ప్రశ్నించాడు.

"ఒరేయ్, మా ఆవిడకి నొప్పులొస్తున్నాయి. హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాలి. ఆటోగానీ, టాక్సీగానీ చూడాలి.."

"హాస్పిటల్‌కి ఫోను చెయ్యలేకపోయావా, వాళ్ళే ఆంబులెన్సు పంపించేవారుకదా" అన్నాడు, సుబ్బారావు.

"హాస్పిటల్ ఫోను నెంబరు నాదగ్గర లేదురా"

"నా దగ్గరుందిలే. పద ఫోను చేద్దాం" అంటూనే కాస్తంత దూరంలో వున్న ఎస్ టి డి బూత్‌కి నడిచారిద్దరూ.

సుబ్బారావు జేబులోంచి పుస్తకం తీసి, హాస్పిటల్‌కి ఫోనుచేశాడు, ఆంబులెన్సు పంపించమని. అయితే; ఆంబులెన్సు ఇంకో పేషెంటుని తీసుకురావడానికే వెళ్ళిందని అట్నుంచి సమాధానం రావడంతో, నీరసంగా ఫోన్ పెట్టేశాడు, సుబ్బారావు.

"ఏమయ్యిందిరా! పంపిస్తానన్నారా?" ఆత్రుతగా అడిగాడు, రాజు.

"లేదురా! ఎవరో పేషెంటుని తీసుకురావడానికే ఆంబులెన్సు వెళ్ళిందట" అన్నాడు.

రాజు మోహం వాడిపోయింది. మళ్ళీ ఆ ఇద్దరూ రోడ్డుమీదికి వచ్చారు. కాస్తంత దూరంలో, ఏదో ఆటో వస్తూ వుండటం, వారి కంటబడింది. వాళ్ళిద్దరూ ఆటోకేసి నడిచారు. ఆటోలో మెడికల్ షాపు సూర్యం వున్నాడు.

"మీరా సూర్యంగారూ.." అన్నాడు, రాజు.

"మీరు ఎక్కడికి బయల్దేరారండీ!" అన్నాడు సూర్యం.

"మా ఆవిడకి, హఠాత్తుగా నొప్పులొచ్చాయండీ. హాస్పిటల్‌కి ఫోనుచేస్తే, ఆంబులెన్సు ఎవర్నో తీసుకొచ్చేందుకు బైటికి వెళ్ళిందన్నారు. ఏదైనా ఆటో దొరుకుతుందేమోనని వెదుకుతున్నాం.." అన్నాడు రాజు.

"అలాగా! నేను ఇంటికి నడిచి వెళ్ళిపోతాన్లెండి.. ఈ ఆటో మీరు తీసుకెళ్ళండి" అంటూనే ఆటోనుంచి దిగిపోయి, ఆటో డ్రైవరుకి డబ్బులిచ్చేసి ముందుకు సాగిపోయాడు, సూర్యం.

సూర్యంకి ధన్యవాదాలు చెప్పుకున్నాడు, రాజు. రాజు, సుబ్బారావు, ఆటోలో కూచుని, పోనిమ్మన్నారు.

ఆటో రాజు ఇంటి దగ్గర ఆగింది.

రాజు, మెల్లగా సునందని నడిపించి, ఆటోలో కూచోబెట్టి, ఇంటికి తాళం వేసి, భార్య పక్కనే కూచున్నాడు.

"సుబ్బారావ్, నువ్వూ రాకూడదురా" అన్నాడు రాజు. రాజులో ధైర్యం సన్నగిల్లుతున్నట్టనిపించింది, సుబ్బారావుకి. అటువంటి సమయంలో తన అవసరం ఉండొచ్చునేమోననుకున్నాడు.

"నువ్వు అడగాలేమిత్రా! పద నేనూ వస్తాను. మనిషి దగ్గర మనిషి ఉండటం, ఇటువంటి సమయాల్లో మంచిదే!" అంటూ రాజు పక్కనే కూచుండిపోయాడు, సుబ్బారావు.

సునంద, బాధగా మూలుగుతోంది.

ఆటో కదిలింది.

"బాబూ, కాస్త నిదానంగా తీసుకెళ్ళు" అన్నాడు, రాజు.

"అలాగే సార్" అన్నాడు ఆటో డ్రైవరు.

సునందకి బాధ అధికమవుతోంది. ఎంత భరించుకోవాలనుకున్నా, సాధ్యపడ్డం లేదు. బాధతో అరుస్తోంది. భార్య బాధని చూసి,రాజుకి ఏడుపొచ్చింది. అతని కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

"కొద్దిగా ఓపికపట్టు సునందా! మరి, కాస్సేపట్లో హాస్పిటల్ చేరుకుంటాం" అన్నాడు, రాజు.


"ఔను చెల్లెమ్మా! కాస్తంత ఓపిక పట్టాలి మరి. ఇటువంటి సమయంలోనే ధైర్యంగా వుండాలమ్మా" అన్నాడు సుబ్బారావు కూడా.

ఆమె బాధ చూస్తూ వుంటే, వింటూ వుంటే, ఆటో డ్రైవరుకీ జాలి వేసింది. స్పీడు కాస్త అధికం చేశాడు. రాజుకి భయం వేసింది.

"అంత స్పీడు వద్దు బాబూ! ఎత్తు, పల్లాల్లో ఇబ్బందికదా!" అన్నాడు రాజు.

"మీరేం భయపడకండి సార్. ఈ రోడ్డు నాకు బాగా పరిచయమైనదే! ఎక్కడ గతుకులున్నాయో, నాకు బాగా తెలుసు. పాపం, అమ్మగారి బాధని చూళ్లేకపోతున్నాను.." అంటూ అదే స్పీడుని మెంటెయిన్ చేశాడు, ఆటో డ్రైవరు.

రాజు, వేయిదేవుళ్ళకు మొక్కుకుంటున్నాడు. మనసులో, తన భార్యని కాపాడమని.



సుబ్బారావు, స్నేహితుడికి ధైర్యం చెబుతున్న ధోరణిలో భుజం తడుతున్నాడు.

నగరంలోకి వచ్చేశారు. హాస్పిటల్ మరెంతో దూరంలో లేదు. మరో పది నిమిషాల్లో హాస్పిటల్ చేరుకోవచ్చు.. అనుకున్న రాజుకి, కొంత మనోనిబ్బరం ఏర్పడింది.

అయితే, ఎప్పుడు ఏం జరుగుతుందో, ఎవ్వరూ చెప్పలేరు.

సాఫీగా సాగిపోతున్న ఆటో, హఠాత్తుగా ఆగిపోయింది. రాజుకి, గుండె ఆగిపోయినంత పనయ్యింది.

"ఏమయింది బాబూ! ఆటో ఆగిపోయిందేం?" ఆత్రుతగా అడిగాడు, రాజు.

"అదే ఆశ్చర్యంగా వుందండీ. ఏమయిందో, చూస్తాను" అంటూ ముందుగా పెట్రోల్ చూసుకున్నాడు. పెట్రోలు లేదు. ఆటో డ్రైవరుకి మతిపోయినట్టయింది. ఇటువంటి తరుణంలో పెట్రోలు అయిపోవడం ఏమిటీ..! అనుకున్నాడు.

"ఏమయింది బాబూ!" మళ్ళీ అడిగాడు, రాజు.

"ఎలా చెప్పడమో, అర్థంకావడం లేదండీ! టౌన్లోకి వెళ్ళినవెంటనే పెట్రోలు పోయించుకోవాలని అనుకున్నానండీ. కానీ, దురదృష్టవశాత్తు ఇప్పుడే అయిపోయిందండీ" చెప్పాడు డ్రైవరు. అతని మాటలో బాధ మిళితమై వుంది.

"ఆ!" అంటూ ఆత్రుత, ఆరాటంతో క్షణం అలా వుండిపోయాడు, రాజు.

సుబ్బారావుకి, ఇదేదోఅపశకునంలా తోచింది.

లేకపోతే, టౌన్‌లోకి వచ్చేశామని సంబరపడుతున్న సమయంలో ఈ విపత్తు ఏమిటి..? అనుకున్నాడు లోలోన. తన మనసులోని మాటని బైటపెట్టలేదు.

ఆటో డ్రైవరు, కిందికిదిగాడు.

"ఇప్పుడేం చేద్దాం బాబూ!"అడిగాడు, రాజు.

"అదే నాకేం తోచడం లేదండీ. ఏదైనా ఆటోగాని, స్కూటరుగాని వచ్చినా బావుణ్ణు, వాళ్ళదగ్గర్నించి కాస్తంత పెట్రోలు లాగేవాణ్ణి!" అన్నాడు, డ్రైవరు.

సునంద బాధ, అధికం అవుతోంది. ఆమె అరుపులు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. సీటంతా రక్తంతో తడిసిపోయింది. అది గమనించిన రాజు, భయంతో కంపించిపోయాడు.

"కానీ, ఇంతవరకూ ఏ ఆటోగానీ, స్కూటరుగానీ, మన దృష్టిలో పళ్ళేదు. చూడు బాబూ, ఆవిడ ఎంతగా కష్టపడిపోతోందో!" అన్నాడు రాజు ఆవేదనతో. అతని గొంతు బొంగురుపోయింది.

సుబ్బారావు ఆటోలోంచి కిందికి దిగాడు.

"ఒరేయ్ రాజూ, ఎవరో వస్తారని ఎదురుచూస్తే ఎలా? నువ్వు సిస్టర్ని జాగ్రత్తగా పట్టుకో. నేను ఆటోని వెనుకనుంచి నెట్టుతాను. డ్రైవరు బాబూ, నువ్వు మామూలుగా డ్రైవ్ చెయ్యి" అన్నాడు సుబ్బారావు.

డ్రైవరు సరేనంటూ, తన సీట్లో కూచుని నడుపుతున్నాడు. సుబ్బారావు, ఒంటరిగా ఆటోని నెడుతున్నాడు. కానీ, ఎంతసేపు నెట్టగలడు, ఆటో కొద్దిదూరమే పోయింది.

సునంద అరుపులు పూర్తిగా తగ్గినయ్. రాజు గుండె ఝల్లుమంది.

"సునందా.. సునందా.." అంటూ పిచ్చిగా అరిచాడు. అయినా సునంద కళ్ళు తెరవలేదు.

"సునందా.. ఇదిగో హాస్పిటల్ దగ్గరికి వచ్చేశాం.." అన్నాడు ఆతృతగా.

"రాజూ, అదిగో హాస్పిటల్.. కనిపిస్తోంది. నేను వెళ్ళి డాక్టర్ని తీసుకొస్తానుండు..' అంటూ పరుగు లంకించుకున్నాడు, సుబ్బారావు. ఆ క్షణంలో ఆత్రుత అలా వుంది. ఏదో ఆశ, అతణ్ణి పరుగెత్తించింది.

రాజు, పిచ్చిగా ఏడుస్తున్నాడు.

"సునందా.. సునందా " అని పిలుస్తున్నాడు. ఆటో డ్రైవరు తను కిందికిదిగి ఆటోని నడిపించాడు. అతనికీ పరిస్థితి జాలి కలిగించింది. భగవంతుడు, ఇంత నిర్దయుడా! హాస్పిటల్ కొద్ది దూరంలో ఉండగా, పెట్రోలు అయిపోవాలా? ఈలోగా ఏదేనా వెహికిల్ వస్తే కాదూ! ఆమె దురదృష్టవంతురాలుగామోసు! లేకపోతే, ఇన్ని అవాంతరాలా? సర్వేశ్వరా, సర్వప్రాణులకూ రక్షకుడవు నీవు.. ఈమె పట్ల ఇంతలో నిర్దయ తగదు. ఈమెను రక్షించు తండ్రీ.. అంటూ మనసులోనే భగవంతుణ్ణి ప్రార్థించాడు, ఆటో డ్రైవరు.

సుబ్బారావు, వగర్చుకుంటూ వచ్చాడు.

"ఏమన్నార్రా డాక్టరు?" ప్రశ్నించాడు రాజు.

"డాక్టరు, రాడట. ఇలా రావడం, వారి రూల్సుకి వ్యతిరేకమట.. పేషెంటునే తీసుకు రమ్మంటున్నారు.." అన్నాడు సుబ్బారావు ఆయాసపడుతూ.

అప్పటికే ఆటో హాస్పిటల్ ప్రాంగణంలోకి వచ్చేసింది.

"భగవంతుడా, ఏమిటీ పరీక్ష! ఆ డాక్టరు హృదయంలో కాస్తంతయినా కనికరం లేదా! మానవత్వం కూడా మరిచాడా! పరిస్థితిని అర్థం చేసుకోకుండా, ఇంత నిర్దయుగా ప్రవర్తిస్తాడేమిటీ? అంతా తన దురదృష్టమా? సునంద కర్మ ఫలితమా?.." అంటూ భోరున ఏడ్చాడు, రాజు.

హాస్పిటల్ ఆవరణలోనే కొద్దిసేపు ఆటో నడిచింది. గేటు దగ్గర ఆపారు. సుబ్బారావు పరుగు పరుగున లోపలికి వెళ్ళి ఎమర్జన్సీ వార్డు నుంచి స్ట్రెచర్‌తోపాటు ఇద్దరు వార్డు బాయ్స్‌ని తీసుకొచ్చాడు.

ఎంతో కష్టంమీద, సునందని స్ట్రెచర్‌మీద పెట్టారు. అప్పటికే ఆమె స్పృహ తప్పి వుంది. స్ట్రెచర్‌తోపాటు, రాజు కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ వెళ్ళాడు. ఆటో డ్రైవరు కూడా కంట తడిబెట్టుకుంటూ, సుబ్బారావుతో వెళ్ళాడు. ఆ స్త్రీ మూర్తి సజీవంగా వుండాలని, వాళ్ళిద్దరూ మౌనంగా కనిపించని ఎన్నో దేవుళ్ళకు మొక్కారు.

ఎమర్జన్సీ వార్డులో లేడీ డాక్టరు వచ్చి, సునందని పరీక్షించింది. అప్పటికే సునంద ప్రాణాలు అనంత విశ్వంలో కలిసిపోయాయని డాక్టరుకి తెలుసు. హృదయవిదారకంగా విలపిస్తున్న ఆ భర్తకి ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో, అర్థం కాలేదు ఆమెకి. కానీ, చెప్పక తప్పదు.. సుబ్బారావుకేసి చూసిందామె.

"ఒక్క పది నిమిషాల ముందు తీసుకుని వచ్చి వుంటే, ఆమె బ్రతికి వుండేదండీ! పాపం దురదృష్టవంతురాలు.." అంటూ చీర చెంగుతో సునంద మొహాన్ని కప్పేసింది.. 'సారీ' అంటూ వెళ్ళిపోయింది లేడీ డాక్టరు.

"సునందా.." అంటూ దిక్కులు పిక్కటిల్లేలా ఆర్తనాదం చేశాడు, రాజు. క్షణంపాటు అచేతనంగా ఆమె శరీరాన్ని చూస్తూ వుండి పోయాడు. అతన్ని చూసిన వాళ్ళంతా జాలిపడ్డారు.

సుబ్బారావు, స్నేహితుణ్ణి పొదివి పట్టుకుని, విలపించాడు. ఆటో డ్రైవరు కళ్ళొత్తుకుంటూ నిలబడి పోయాడు. *

